## క్లుప్తంగా

### ఆర్థిక సాయం



ఇబ్రహీంపట్నం: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన వలంటీర్ ఆర్.నాగలక్ష్మి భర్త వీరవెంకట ప్రసాద్ కుటుంబానికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ రూ.10వేలు శుక్రవారం అందజేశారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పార్టీ నాయకులు జోగి రాజీవ్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. వార్డు కౌన్సిలర్ జోగి రాము పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

గంపలగూడెం: సమరసత సేవ ఫౌండేషన్ గంపలగూడెం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన శిబిరాన్ని గంపలగూడెం సర్పంచ్ కోట పుల్లమ్మ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కొత్తగుండ్ల నరసింహారావు ప్రారంభించారు. శిబిరంలో కామినేని హాస్పిటల్స్‌కు చెందిన వైద్యులు జీవన్ 130 మంది రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో, సాధారణ పరీక్షలను నిర్వహించారు. మ్యాక్‌విజన్ హాస్పిటల్‌కు చెందిన కంటి వైద్యులు అజయ్‌కుమార్ 90 మందికి కంటి పరీక్షలు చేశారు. సమరసత సేవ ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారకులు జయశంకర్, గంపలగూడెం మండల కన్వీనర్ సుజాత, ప్రతినిధులు సత్యవాణి, హనుమంతరావు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

### సాంకేతిక మార్పులను గమనించాలి

తిరువూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు రోజురోజుకూ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అవగాహన చేసుకుని తదనుగుణంగా నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు సూచించారు. ఇంజినీరింగ్‌లో మెకానికల్ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఆయన రచించిన ఇంజినీరింగ్ మెకానిక్స్ పుస్తకాన్ని శుక్రవారం కళాశాలలో ఆవిష్కరించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు నాగేంద్రబాబును అభినందించారు.

### ఇంటర్ ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోండి

రెడ్డిగూడెం: మద్దులపర్వ ఆదర్శ పాఠశాల(మోడల్ స్కూల్)లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఏ వీరరాజు శుక్రవారం తెలిపారు. ఆదర్శ పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో ఉచిత విద్య పొందగోరు వారి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు గుర్తింపు పొందిన పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైనవారు ఈనెల 22వ తేదీ నుంచి జూన్ ఏడో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశం కోసం ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌లు రూ. 200లు, ఎస్సీ, ఎస్టీలకు రూ. 150 రుసుంతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

### కానిస్టేబుల్‌కు ఆర్థిక సాయం

ఇబ్రహీంపట్నం: స్థానిక పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ అశోక్‌కుమార్ ఇటీవల ప్రమాదానికి గురై విజయవాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందున్నాడు. అతని వైద్యఖర్చుల నిమిత్తం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది సమకూర్చిన రూ.75వేలను కానిస్టేబుల్ కుటుంబానికి సీఐ పి.శ్రీను శుక్రవారం అందజేశారు.

# పేదలంటే అంత చులకనా?

**ఎమ్మెల్యే రక్షణనిధి**




చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా తిరువూరులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

తిరువూరు: పేదలకు రాష్ట్ర ప్రభుత్వం నివేశనస్థలాలు మంజూరు చేస్తుంటే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చులకనభావంతో మాట్లాడటం సిగ్గుచేటని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలను ఖండిస్తూ తిరువూరులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన జరిపారు. నియోజకవర్గ కార్యాలయం నుంచి బైపాస్‌రోడ్డు మీదుగా ఈ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పేదలకు నివేశన స్థలాలివ్వకుండా ఇబ్బందులకు గురిచేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తుంటే అవమానకర రీతిలో మాట్లాడిన చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, తిరువూరు, విస్సన్నపేట జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, లోకేష్‌రెడ్డి, తిరువూరు మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దల భారతి, నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పసుపులేటి చంద్రశేఖర్, పరసా శ్రీనివాసరావు, కే సుందరకుమార్, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు గజ్జల సీతారామారావు, తాళ్ళూరి నవీన్‌కుమార్, సీతారామయ్య, నాయకులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం



సీసీ రోడ్డు నిర్మాణానికి తయారు చేసిన అంచనా విలువ పత్రాలను చూపిస్తున్న పీఆర్ ఏఈ సూర్యనారాయణ

ఆగిరిపల్లి: ఆగిరిపల్లికి చెందిన కంబాల సరోజిని కుటుంబ సభ్యులు తాము కొత్తపేట కారం మిల్లు సమీపంలో నివసిస్తున్నామని, సీసీ రోడ్డు, డ్రెయినేజీ సౌకర్యం లేక ఇక్కట్లు పడుతున్నామని జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో గత ఆదివారం ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. సోమవారం పంచాయతీరాజ్ ఈఈ బాపిరెడ్డి ఫిర్యాదు వచ్చిన ప్రాంతానికి వెళ్లి సందర్శించి, ఎస్టిమేషన్ వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం పీఆర్ ఏఈ సూర్యనారాయణ సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనా విలువను తయారు చేశారు. 160 మీటర్లు పొడవు గల సీసీ నిర్మాణానికి రూ.8 లక్షల ఖర్చవుతుందని ప్రణాళికలు సిద్ధం చేసి, పరిపాలన ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు పీఆర్ ఏఈ సూర్యనారాయణ తెలిపారు. ప్రభుత్వ ఆమోదం తెలిపిన వెంటనే సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణానికి తయారు చేసిన అంచనా విలువ పత్రాలను జగనన్నకు చెబుదాం పోర్టల్‌కు ఫిర్యాదు చేసిన కంబాల సరోజిని కుటుంబ సభ్యులకు చూపించారు. దీనిపై వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## 104 వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

చాట్రాయి: 104 వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు జిల్లా వైద్యాధికారి ఆశ పేర్కొన్నారు. చాట్రాయి మండలం చనుబండ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 104 వైద్య సేవలను ఆమె పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు ప్రజలకు ఎంతో దోహదపడుతున్నాయని చెప్పారు. ప్రతి పీహెచ్‌సీలో నెలకు ఐదు డెలివరీలు చేయాలని, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నూజివీడు ఏరియా ఆస్పత్రిలో చేస్తున్నామని తెలిపారు. మండలంలో రెండు పీహెచ్‌సీలు ఏర్పాటు చేశామని కొత్తగా మంజూరైన పీహెచ్‌సీ నిర్మాణ కోసం టెండర్లు త్వరలో పిలుస్తారని తెలిపారు. డాక్టర్లు నిత్యం రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు.

## ఎఫ్‌పీఓఎల్‌ఆర్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి

గంపలగూడెం: జగనన్న శాశ్వత భూహక్కు భూరక్షణలో భాగంగా రెండో విడత భూ సర్వేలో గ్రామాలలో ఎఫ్‌పీఓఎల్‌ఆర్ (ఫీల్డ్ లెవల్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్)ను మే నెలాఖరు నాటికి పూర్తి చేయాల్సి ఉందని తిరువూరు ఆర్డీఓ వైవీ ప్రసన్నలక్ష్మి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెండో విడత భూ రీసర్వేకు ఎంపికైన 15 రెవెన్యూ గ్రామాలకు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఫ్‌పీఓఎల్‌ఆర్ స్టేజీలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వ్యవసాయ భూమికి సంబంధించి పట్టాదారు చనిపోతే అతని కుటుంబ సభ్యులతో మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేయించి సంబంధిత వ్యక్తుల పేరుతో ఆన్‌లైన్లో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సరిహద్దుల తగాదాలు ఉంటే ఇప్పుడే పరిష్కరించి సరిహద్దులు కచ్చితంగా నిర్ణయించాలన్నారు. సర్వేలో రెండో స్టేజీ గ్రౌండ్ ట్రూతింగ్ చేపట్టే వారికి ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను ఒక్క సెంటు కూడా మినహాయింపు లేకుండా స్వాధీనపరుచుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, మండల సర్వేయర్ సాంబశివరావు, సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

రెడ్డిగూడెం: సీపీఎం మొదటి జాతీయ ప్రధాన కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా రెడ్డిగూడెం సీపీఎం కార్యాలయంలో మండల కార్యదర్శి జంగా వెంకటరెడ్డి, నాయకులు ఉయ్యూరు కృష్ణారెడ్డి తదితరులు సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు కొండపల్లి పరమేశ్వరరావు, శాఖా కార్యదర్శి అప్పిరెడ్డి, బాబు పాల్గొన్నారు.

**కొండపల్లిలో..**

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సుందరయ్య వర్ధంతి కార్యక్రమం కొండపల్లిలో శుక్రవారం జరిగింది. సీపీఎం కొండపల్లి కార్యదర్శి ఎం.మహేష్ ఆధ్వర్యంలో సుందరయ్య చిత్ర పటానికి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానికులకు మజ్జిగ పంపిణీ చేశారు. నాయకులు విఠల్‌రావు, మురళీమోహన్, ఐద్వా సభ్యులు బేబీసరోజినీ, పార్వతి పాల్గొన్నారు.

**మైలవరంలో..**

మైలవరం: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని మైలవరం సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి రావూరి రమేష్‌బాబు, నాయకులు సుధాకర్, మోహనరావు, శేషయ్య, పూర్ణ, రాజారెడ్డి పాల్గొన్నారు.

**మునుకుళ్లలో..**

మునుకుళ్ల(తిరువూరురూరల్): మండలంలోని మునుకుళ్లలో సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం జరిగింది. సుందరయ్య చిత్రపటానికి పలువురు సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### ఆణిముత్యాలుగా ముగ్గురు విద్యార్థులు

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులు జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలకు ఎంపికయ్యారు. గంపలగూడెం మండలం కనుమూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జెర్రిపోతుల లక్ష్మి(573 మార్కులు), ఏకొండూరు మండలం కోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన శీలం ధనలక్ష్మి(567 మార్కులు), తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన పిట్టా స్ఫూర్తి (564 మార్కులు) ఈ పురస్కారాలకు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి పరిధిలోని 11 కేవీ జైన్ కాలనీ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా దిగువ తెలిపిన ప్రాంతాల్లో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (విజయవాడ టౌన్) బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు నలంద కాలేజీ ఏరియా, బైపాస్ రోడ్, అట్కిన్‌సన్ స్కూల్ రోడ్, శ్రీశైలం కాలనీ ఏరియా వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

### ఉత్తమ అధ్యయనానికి గ్రంథాలయాలే గురువులు

మునునూరు: ఉత్తమ పుస్తక అధ్యయనానికి గ్రంథాలయాలే గురువులని గణిత ఉపాధ్యాయుడు సుబ్బారావు అన్నారు. గోపవరం గ్రంథాలయంలో బ్రాంచి అధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో శుక్రవారం ఆయన చిక్కులెక్కలకు చక్కని పరిష్కారంపై చిన్నారులకు వివరించారు. విద్యార్థి జీవితంలో గ్రంథాలయాలు, ఆంగ్లం, గణితంల ప్రాధాన్యాన్ని ఉపాధ్యాయులు బాలలకు వివరించారు.

### వేణుగోపాలరావు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

తోలుకోడు(మైలవరం): మైలవరం మండలం తోలుకోడు పీఏసీఎస్ అధ్యక్షుడు వరద వేణుగోపాలరావు కుటుంబ సభ్యులను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం రాత్రి పరామర్శించారు. తోలుకోడు పీఏసీఎస్ అధ్యక్షుడు వరద వేణుగోపాలరావు అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. వేణుగోపాలరావు అంతిమ యాత్రలో ఎమ్మెల్యేతో పాటు ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ రైతు విభాగం అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకటరావు, వైస్ ఎంపీపీ షేక్ రహీం, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్ తిరుపతిరావు, రెడ్డిగూడెం మండలం జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.

## • ఆత్మీయ పలకరింపు



వలంటీర్లకు వందనం కార్యక్రమం విజయవాడ ఏ ప్లస్ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మైలవరం, తిరువూరు ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయంగా పలకరించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

## 'సుకన్య సమృద్ధి యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి

ఆగిరిపల్లి: కేంద్ర ప్రభుత్వం తపాల కార్యాలయాల ద్వారా ప్రవేశ పెట్టిన సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని ఆడపిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.శివకుమారి సూచించారు. ఆగిరిపల్లి మండలం కొమ్మూరులో సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు చిన్నారి భవిత కార్యక్రమం నిర్వహించారు. ఆడ పిల్లలకు బాల్య వివాహాలు, వరకట్నాలు ప్రోత్సహించడం వల్ల వారి బంగారు భవిష్యత్‌కు అడ్డుకట్ట వేసిన వారవుతారని శివకుమారి వివరించారు. ఈ సందర్భంగా ఆడపిల్లల తల్లిదండ్రులతో చిన్నారి భవిత కార్యక్రమ ఉద్దేశంపై ప్రతిజ్ఞ చేయించారు. సుకన్య సమృద్ధి యోజన పథకంలో చేరి ఆడపిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోసూరి ఏసు, సూరవరం ఎంపీటీసీ సభ్యుడు పరసా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## పేదలు బాగుపడుతుంటే చంద్రబాబు ఓర్వలేడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నూజివీడు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాబోయే ఎన్నికల్లో నివేశన స్థలాలు పొంది సొంతింటి కలను సాకారం చేసుకుంటున్న రాష్ట్రంలోని 30 లక్షల పేదలే చరమగీతం పాడతారని నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్ పేర్కొన్నారు. పేదల ఇళ్ల స్థలాలపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కౌన్సిలర్లతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలు బాగుపడుతుంటే చంద్రబాబు ఓర్వలేడని, తన హయాంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వొద్దని జీఓను తీసుకువచ్చిన చరిత్రహీనుడని ధ్వజమెత్తారు. టిడ్కో గృహాల పేరుతో చంద్రబాబు ప్రారంభించిన 300, 365, 430 చదరపు అడుగుల ప్లాట్లు సెంటు స్థలం కంటే తక్కువని వాటిని ఏమనాలో చంద్రబాబే చెప్పాలని ప్రశ్నించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర స్థలం ఇవ్వడమే కాకుండా రూ.1.80 లక్షలను ఒక్కొక్క లబ్ధిదారుడికి ఉచితంగా ఇస్తూ దాదాపు రూ.20 లక్షల గృహాలు నిర్మిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేక చంద్రబాబు పిచ్చిపట్టి నోటికి ఏదివస్తే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిందని, 14 ఏళ్ల పాలనలో వెయ్యి మందికన్నా ఇళ్ల స్థలాలు ఇచ్చావా అని చంద్రబాబుని నిలదీశారు. చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు నాగమల్లేశ్వరరావు, దాసరి మారుఅప్పాజీ, రంగారావు, నాయకులు యూనస్‌పాషా, లవకుమార్, సుగుణరావు, హరికోటి ప్రసాద్, ఆదినారాయణ, మస్తాన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రతిపాదిత శ్మశాన భూముల పరిశీలన

ముసునూరు: ఎస్సీలకు కేటాయించనున్న శ్మశాన వాటిక స్థలాలను జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌తో కలిసి పరిశీలించారు. ముసునూరు మండలం వేల్పుచర్ల, చెక్కపల్లి, గ్రామాల్లో ఎస్సీలకు కేటాయించేందుకు గుర్తించిన భూములను శుక్రవారం సందర్శించి, చేసి, భూ రికార్డులను పరిశీలించారు. వేల్పుచర్లలో 50 సెంట్లు, చెక్కపల్లిలో ఎకరం డొంక పోరంబోకు భూములను ప్రభుత్వ నిబంధనల ప్రకారం కన్వర్షన్ చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ భూముల సరిహద్దు దారులకు నోటీసులు ఇచ్చి పారదర్శకంగా భూకేటాయింపు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ దాసరి సుధ, ఆర్ఐ మాధవ సాయిరామ్, సర్వేయర్ కేపీ సురేష్ బాబు, వీఆర్‌ఓ సురేష్ పాల్గొన్నారు.

## చీఫ్ ఇంజినీర్‌కు ఉద్యోగుల అభినందన

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో నూతన చీఫ్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.నవీన్‌గౌతమ్‌ను ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచాలు, జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఉద్యోగులు, అధికారుల సహకారంతో సంస్థ పురోభివృద్ధికి మరింత కృషి చేస్తానని, అందుకు మీ అందరి సహకారం కావాలని సీఈ సూచించారు. యూనియన్ తరఫున పూర్తి సహకారం అందిస్తామని యూనియన్ రాష్ట్ర నాయకులు సత్యప్రసాద్, బ్రాంచి అధ్యక్షుడు ఉమావిజయ్‌చంద్, మణిబాబు, వెంకటరమణ తెలిపారు.

### నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గంపలగూడెం: గంపలగూడెం సచివాలయం–1 పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తారని పేర్కొన్నారు.



### డ్రోన్‌ల పనితీరు పరిశీలన

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వలో ఏర్పాటు చేసిన జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో డ్రోన్‌ల వినియోగం, వాటి పనితీరును రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో నాయకుడు మద్దిరెడ్డి జమలారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మరీదు ధనలక్ష్మీ, పాలంకి రమణారెడ్డి, మాజీ సర్పంచ్ కోమటికృష్ణ పాల్గొన్నారు.



## సంక్షిప్త వార్తలు

**చీపురుగూడెంలో చిన్నారి భవిత**

చాట్రాయి: మండలంలోని చీపురుగూడెంలో చిన్నారి భవిత కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఆడ బిడ్డ పుట్టినప్పటి నుంచి జీవితంలో స్థిరపడే వరకు వివిధ దశల్లో సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వ చిన్నారి భవిత పథకాన్ని అమలు చేస్తోందని ఐసీడీఎస్ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా పాపకు కిట్, పుట్టిన తేదీ సర్టిఫికేట్ అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు స్వరూపరాణి, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరావు, వసంతరావు పాల్గొన్నారు.

**రైతుల సంక్షేమానికి కృషి**

లక్ష్మీపురం (తిరువూరురూరల్): పాడిరైతుల సంక్షేమమే ధ్యేయంగా కృష్ణా మిల్క్ యూనియన్ పనిచేస్తుందని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో పాల ఉత్పత్తిదారులకు యూనియన్ చేస్తున్న సేవా కార్యక్రమాలపై అవగాహన సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సబ్సిడీపై సెమన్ సరఫరా చేస్తూ నాణ్యమైన దూడలకు పశువులు జన్మనిచ్చే విధంగా యూనియన్ ఏర్పాట్లు చేసిందన్నారు.

**మూడు దఫాలుగా బోనస్ పంపిణీ**

విస్సన్నపేట: కృష్ణా మిల్క్ యూనియన్‌లో పాడిరైతులకు సంవత్సరానికి మూడు దఫాలుగా బోనస్ పంపిణీ చేయడంతో పాటు అత్యధిక పాలసేకరణ ధర రూ.80 అందిస్తున్నట్లు ఆ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు.మండలంలోని కలగర,లక్ష్మీపురం గ్రామాల్లో పాడిరైతులతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. జిల్లా పాలకవర్గ సభ్యురాలు వాణిశ్రీ, సంఘ అధ్యక్షురాలు విజయకుమారి, లక్ష్మి, మేనేజర్ సాంబశివమూర్తి పాల్గొన్నారు.

**కృత్రిమ అవయవాలతో ఆత్మ విశ్వాసం**

ఆగిరిపల్లి: కృత్రిమ అవయవాలతో దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుందని హీల్ ప్రిన్సిపాల్ సాయిబాబు అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో విజయనగరం జిల్లాకు చెందిన డిగ్రీ విద్యార్థి చందనా నవీన్‌కు కృత్రిమ కాలును శుక్రవారం అందజేశారు. హీల్ సీఈఓ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

**గోవుల తరలింపును అడ్డుకున్న హనుమాన్ సేన**

నూజివీడు: విజయనగరం జిల్లా అలమండ నుంచి హైదరాబాద్‌కు రెండు లారీల్లో తరలిస్తున్న దాదాపు 200 గోవులను నూజివీడులో శుక్రవారం రాత్రి హనుమాన్‌సేన పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ గోవుల్లో సగంపైన దూడలు కూడా ఉన్నాయి. ట్రాఫిక్ ఎస్సై శాగం రాధాకృష్ణారెడ్డి వెంటనే లారీలను స్వాధీనం చేసుకుని రూరల్‌పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉంచారు. రెండు లారీల డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

**జాబ్ మేళాలో 137 మంది ఎంపిక**

తిరువూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. 12 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు 419 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి 137 మందిని ఎంపిక చేశారు. తొలివిడత 92 మందికి నియామకపత్రాలను అందజేశారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఎమ్మెల్యే రక్షణనిధి చొరవతో ఈ జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ఎడీసీ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నరేష్‌కుమార్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు పర్యవేక్షించారు.

**మజ్జిగ పంపిణీ**

నూజివీడు: స్థానిక బస్టాండు వద్ద రోటరీక్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్ ఆధ్వర్యంలో శుక్రవారం పరకు మజ్జిగ పంపిణీ చేశారు. ఐదు రోజులుగా ప్రయాణికులు, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్టు అధ్యక్షుడు మలిశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి దేవిరెడ్డి శివశేషిరెడ్డి తెలిపారు. రోటరీ సభ్యులు లక్ష్మణస్వామి, ముఖర్జీ, శ్రీనివాస్, రాజగోపాల్ పాల్గొన్నారు.

**గురుకుల పాఠశాలలో సీట్లు భర్తీకి దరఖాస్తులు**

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా ఏడాదికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ కె.శైలజ శుక్రవారం తెలిపారు. 3వ తరగతిలో 40 సీట్లు, 4 నుంచి 6వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లు ఎస్టీ బాలికలతో భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. పాఠశాలలో చేరగోరు బాలికలు నేరుగా సంప్రదించాలని పేర్కొన్నారు. వివరాలకు 83339 25169లో సంప్రదించాలని పేర్కొన్నారు.

**నాడు–నేడు పనులు జూన్–2కు పూర్తి కావాలి**

మైలవరం: ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించిన నాడు–నేడు పనులు ఈ ఏడాది జూన్ రెండో తేదీ కల్లా పూర్తయ్యేలా చూడాలని ఎన్టీఆర్ జిల్లా అకాడమిక్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపీసీ) జీ మహేశ్వరరావు తెలిపారు. మైలవరం మండల విద్యా వనరుల కేంద్రాన్ని ఏపీసీ మహేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. మండల విద్యా వనరుల కేంద్రంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు సీఆర్‌పీలు, పీటీఐలు, ఎంఆర్‌సీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎంఓ రాంబాబు, ఏఎంఓ సురేష్ పాల్గొన్నారు.

**సేవా పురస్కారాలకు వలంటీర్ల ఎంపిక**

తిరువూరు: మండలంలో సేవా వజ్ర, సేవా రత్న పురస్కారాలకు పలువురు వలంటీర్లు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. ఎం యుగంధర్‌బాబు(నడిం తిరువూరు), రెక్కల కృష్ణలత(ఎ్రమాడు), గాదంశెట్టి దీపికారాణి(తిరువూరు) సేవా వజ్ర పురస్కారాలకు ఎంపికయ్యారని తెలిపారు. తాటి కృష్ణయ్య(వావిలాల), బాలమర్తి కృష్ణారావు (లక్ష్మీపురం), కోలా పున్నయ్య(వావిలాల), చలివేంద్ర వందన(ఎ్రమాడు), సేకు మరియమ్మ (రోలుపడి), వినుకొండ శాంతమ్మ(రాజుపేట), ధరావతు వెంకట్రామయ్య(సుగాలీ కాలనీ), రామకృష్ణ(రాజుపేట), ప్రవల్లిక(రాజుపేట), స్రవంతి(రాజుపేట) సేవా రత్న పురస్కారాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

**విస్సన్నపేటలో..**

విస్సన్నపేట: మండలంలోని కలగర సచివాలయం వలంటీర్లు అజ్మీరా రాజగోపాలస్వామి, పగుట్ల సుమలతలు సేవా వజ్ర పురస్కారం అవార్డులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం అందుకోనున్నట్లు ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ శుక్రవారం తెలిపారు. వేమిరెడ్డిపల్లి సచివాలయం వలంటీరు పోతునూరు అశోక్, కలగర సచివాలయం తేళూరి దీప్తి, విస్సన్నపేట సచివాలయం–4 వలంటీరు జె దుర్గాభవాని, సచివాలయం–3 వలంటీరు ఎస్.విజయమౌలిక, సచివాలయం–2 వలంటీరు రేవతికి సేవారత్న పురస్కారాలు వచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు.